# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-11-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు... ఈ రోజు సీఆర్‌డిఏ, క్రీడలు సహా పలు శాఖలపై సమీక్ష నిర్వహిస్తున్నారు.**

**2. ఉపాధ్యాయ అర్హత పరీక్ష- టెట్ ఫలితాలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ రోజు విడుదల చేశారు.**

**3. ఉల్లి రైతులు నష్టపోకుండా వారికి తగిన మద్దతు ధర కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని కర్నూలు జిల్లా ఇంఛార్జి మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**

**4. తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం తాడిపర్రులో ఈ రోజు జరిగిన విద్యుదాఘాతం ఘటనలో నలుగురు మృతిచెందారు.**

**5. కార్తీక మాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకొని ఈరోజు రాష్ట్రంలోని ప్రముఖ శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి.**

==========================

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పలు శాఖలపై సమీక్షలు నిర్వహిస్తున్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ – సీఆర్డీఏ చైర్మన్ హోదాలో ముఖ్యమంత్రి రాజధాని నిర్మాణ అంశాలపై సీఆర్‌డిఏ అధికారులతో చర్చిస్తున్నారు. అనంతరం రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించేందుకు తీసుకోవాల్సిన చర్యలు , నూతన క్రీడా విధానంపై చంద్రబాబు నాయుడు, రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సంబంధిత అధికారులతో సమీక్షించనున్నారు. ఈ సాయంత్రం వ్యవసాయ, పశుసంవర్ధక శాఖలపై మంత్రి అచ్చెన్నాయుడు, సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు.

-------------------------

ఉపాధ్యాయ అర్హత పరీక్ష- టెట్ ఫలితాలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఫలితాలను అమరావతిలో ఈ రోజు విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. టెట్ పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షల 68 వేల 661 మంది హాజరుకాగా, మొత్తం లక్షా 87 వేల 256 మంది అర్హత సాధించారని తెలిపారు. 50.79 శాతం మంది ఉత్తీర్ణులైయ్యారని, ఫలితాలను అధికారిక వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు త్వరలోనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు.

---------------------------

ఉల్లి రైతులు నష్టపోకుండా వారికి తగిన మద్దతు ధర కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని కర్నూలు జిల్లా ఇంఛార్జి మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. కర్నూలులోని ఉల్లి మార్కెట్‌ను రాష్ట్ర మంత్రి టీజీ భరత్‌తో కలిసి మంత్రి ఈరోజు తనిఖీ చేశారు. అనంతరం నిమ్మల రామానాయుడు పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఈ-నామ్ బిడ్డింగ్ పని చేయని కారణంగా ఆఫ్‌లైన్‌లోనూ పంటను నమోదు చేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. గతేడాది అక్టోబర్‌లో మార్కెట్‌కు 52 వేల టన్నుల ఉల్లి వస్తే.. ప్రస్తుతం దానికి నాలుగు రెట్లు అధికంగా 2.5 లక్షల టన్నుల ఉల్లి వచ్చినప్పటికీ రైతులు ఎక్కువ ధరను పొందారని తెలిపారు. దళారుల నివారణకు జిల్లాలోని కోడుమూరులో కూడా ఉల్లి మార్కెట్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి వివరించారు.

---------------------------

తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం తాడిపర్రులో ఈ రోజు జరిగిన విద్యుదాఘాతం ఘటనలో నలుగురు మృతిచెందారు. స్వాతంత్ర్య సమరయోధులు సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ సందర్భంగా ఫ్లెక్సీలు కడుతుండగా ఈ ఘటన చోటుచేసుకుందని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై మరిన్ని వివరాలను మా ఆకాశవాణి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి కె.వి.వి సత్యనారాయణ అందజేస్తారు.

వాయిస్ ( 32 సెకన్లు)

---------------------------

విద్యుదాఘాతం ఘటనపై రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో నలుగురు మృతి చెందడం బాధాకరమన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున 5 లక్షల రూపాయల చొప్పున పరిహారం ప్రకటించారు. ఇదిలా ఉండగా పశ్చిమగోదావరి జిల్లా తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో మృతుల కుటుంబాలను, క్షతగాత్రులను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌లు పరామర్శించారు.

---------------------------

అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వి.అనిత తెలిపారు. తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి వారిని మంత్రి ఈరోజు దర్శించుకున్నారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 130 రోజుల్లోనే అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిందని చెప్పారు.

---------------------------

రాష్ట్రంలో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి జి.సంధ్యారాణి తెలిపారు. శ్రీకాకుళంలో మంత్రి ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో అంగన్వాడీ కేంద్రాలకు ప్రాధాన్యతనిస్తూ, కొత్తగా 186 కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కేంద్రాల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. గిరిజన సంక్షేమశాఖ ద్వారా 350 కోట్ల రూపాయలతో గిరిజన గ్రామాలను కలుపుతూ అనుసంధాన రహదారులను నిర్మిస్తున్నామని మంత్రి వివరించారు.

---------------------------

---------------------------

ఎన్టీఆర్ జిల్లా మూలపాడులో గోల్ఫ్ క్రీడామైదానాన్ని ఏర్పాటు చేయనున్నామని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ తెలిపారు. మూలపాడు గ్రామంలోని క్రీడా మైదానాన్ని ఎంపీ ఈరోజు సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మూలపాడులో గోల్ఫ్ కోర్టు ఏర్పాటు చేయడం ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని శివనాథ్ తెలుపుతూ,

వాయిస్ ( 29 సెకన్లు)

---------------------------

కార్తీక మాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకొని ఈరోజు రాష్ట్రంలోని ప్రముఖ శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. నంద్యాల జిల్లా శ్రీశైలంలో శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల దర్శనానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. శ్రీ స్వామి అమ్మవార్ల దర్శనానికి సుమారు 4 గంటల సమయం పడుతోంది. తిరుపతి జిల్లాలోని ప్రముఖ వాయులింగ క్షేత్రం శ్రీకాళహస్తిలో ఈ తెల్లవారుజాము నుంచే భక్తులుఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం పుష్కర ఘాట్ వద్ద భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి, శివాలయాల్లో క్షీరాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఉభయ గోదావరి జిల్లాలలోని పంచారామ క్షేత్రాల్లో భక్తుల రద్దీ నెలకొంది. బాపట్ల జిల్లాలోని రేపల్లె, చీరాల, బాపట్ల, అద్దంకి నియోజకవర్గాలలోని దేవాలయాలలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు.

---------------------------

ప్రభుత్వ అధికారులు నిజాయితీగా పని చేస్తూ ప్రజలకు సేవలు అందించాలని అనంతపురం డివిజనల్ ఖజానా అధికారి సతీష్ కోరారు. కేంద్ర యువజన క్రీడల మంత్రిత్వ శాఖ, మై భారత్, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నిన్న అనంతపురంలో నిర్వహించిన విజిలెన్స్ వారోత్సవాల అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ అవినీతి రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. అవినీతి నిర్మూలన, లంచం ఇవ్వడం, తీసుకోవడం నేరం వంటి అంశాలపై అధికారులకు అవగాహనా కల్పిస్తున్నామని ఆయన తెలుపుతూ,

వాయిస్ ( 25 సెకన్లు)

---------------------------

దక్షిణ మధ్య రైల్వే పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీ.ఎం. రమేష్ రైల్వే శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి వారిని ఈ ఉదయం దర్శించుకున్న ఆయన అనంతరం తిరుపతికి చేరుకుని రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీ.ఎం.రమేష్ మాట్లాడుతూ, తిరుపతి రైల్వే స్టేషన్‌కు ప్రతిరోజు 70వేల మందికి పైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారని.. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను చేపట్టాలని అధికారులకు సూచించారు.

=====================